సాక్షి విశాఖపట్నం

శుక్రవారం। 27। డిసెంబర్। 2024

విశాఖతో మన్మోహన్‌కు అనుబంధం



స్టీల్‌ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మన్మోహన్ సింగ్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గతంలో పలు మార్లు విశాఖలో పర్యటించారు. 2006 మే 20న స్టీల్ ప్లాంట్ విస్తరణ పనులకే ఆయనే శంకుస్థాపన చేశారు. 2008 జనవరి 2వ తేదీన తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ జలశ్వ యుద్ధ నౌకలో పర్యటించారు. అనంతరం జలశ్వలో విధులు నిర్వర్తిస్తున్న వారితో ఆన్ బోర్డుపై మన్మోహన్ కాసేపు ముచ్చటించారు. 2009 జూలై 26న సతీసమేతంగా విశాఖలో పర్యటించారు. ఆ సమయంలో భారత నౌకాదళంలో కీలకమైన జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్‌ని జాతికి అంకితం చేశారు. ఆయా సందర్భాల్లో ఆయనకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు.

• సిరులతల్లికి నీరాజనం



సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు కొలువుదీరిన బురుజుపేట భక్తులతో కిక్కిరిసిపోయింది. మార్గశిరమాసం నాలుగో గురువారం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



• గంగమ్మా.. కాపాడమ్మా



తల్లీ నిన్నే నమ్ముకున్నాం.. చల్లంగ చూడమ్మా.. అంటూ గంగపుత్రులు నిండు మనసుతో గంగమ్మ తల్లికి క్షీరాభిషేకం చేశారు. సునామీ వచ్చి 20 ఏళ్లు కావడంతో పెదజాలరిపేట మత్స్యకారులు ప్రత్యేక పూజలు జరిపారు.



• సాగర తీరంలో ఎర్రకవాతు

భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) శత వార్షికోత్సవాల ప్రారంభం సందర్భంగా బీచ్‌రోడ్డులో ఎర్ర కవాతు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు సర్కిల్ నుంచి ఆర్‌కే బీచ్ వరకు సాగారు.



10లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పోరుబాటకు తరలిరండి

పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ పిలుపు



సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న నిర్వహించే 'వైఎస్సార్ సీపీ పోరుబాట' విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ సమన్వయకర్తల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం అంతా గురుద్వార్ వద్ద గల ఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంలో పాల్గొని సీఎండీకు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, మేయర్, సమన్వయకర్తలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్యనాయకులతో పాటు విద్యుత్ వినియోగదారులు పాల్గొనాలని కోరారు.

వాల్తేర్ డీఆర్‌ఎంగా లలిత్ బోహ్రా



తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా లలిత్ బోహ్రా నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వేకు ఉత్తర్వులు చేరాయి. ఇప్పటి వరకు ఆయన న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. వాల్తేర్ డీఆర్‌ఎంగా పనిచేసిన సౌరబ్‌ప్రసాద్ సీబీఐ కేసుల్లో ఇరుక్కున్నారు. అప్పటినుంచి వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ డీఆర్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

జూ క్యూరేటర్‌గా మంగమ్మ బాధ్యతల స్వీకరణ



క్యూరేటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంగమ్మ


ఆరిలోవ : ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు క్యూరేటర్‌గా జి.మంగమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ క్యూరేటర్‌గా పనిచేసిన డాక్టర్ నందనీ సలారియా గత అక్టోబరులో మంగళగిరికి బదిలీ కాగా.. అప్పటి నుంచి మంగమ్మ అదనపు క్యూరేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 24న ఆమెకు క్యూరేటర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అటవీ శాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె గురువారం పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జూ అసిస్టెంట్ క్యూరేటర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో 45 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సర్వీస్ అంశాలు ఉన్నాయి.

• ఇదేం బాదుడు బాబూ!

కూటమి కరెంట్ షాక్



- ఎఫ్‌పీపీసీసీ పేరిట కూటమి సర్కారు దొంగ దెబ్బ
- బిల్లు కంటే అదనపు చార్జీల భారమే ఎక్కువ
- 5 యూనిట్ల వినియోగానికి రూ.258 బిల్లు
- విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న నిరసన
- జనం బాధలకు మద్దతుగా నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

ఉమ్మడి విశాఖ ప్రజలపై రూ.293 కోట్లు అదనపు భారం

ఉమ్మడి విశాఖ జిల్లాలో వినియోగదారుల వివరాలు

ఎల్‌టీ కేటగిరీ వినియోగదారులు

కేటగిరీ	కనెక్షన్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	అదనపు భారం (రూ.కోట్లలో)
డొమెస్టిక్	1577984	877.56	80
వాణిజ్యం, ఇతరులు	177265	422.14	10
పరిశ్రమలు	4615	66.61	05
ఇనిస్టిట్యూషనల్	32114	81.59	10
వ్యవసాయం, అనుబంధం	50713	9.12	02
మొత్తం	1842691	1457.01	107

హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులు

కేటగిరీ	కనెక్షన్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	అదనపు భారం (రూ.కోట్లలో)
టౌన్‌షిప్, కాలనీలు	36	20.79	01
వాణిజ్యం, ఇతరులు	1094	537.91	50
పరిశ్రమలు	632	3076.27	100
ఇనిస్టిట్యూషనల్	89	267.00	35
వ్యవసాయం, అనుబంధం	07	1.53	0.20
మొత్తం	1858	3903.51	186.20
ఎల్‌టీ+హెచ్‌టీ	1844549	5360.52	293.20



పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలోని (సర్వీస్ నం.1164252279000722) జీకే రాజా ఇంట్లో రెండు నెలలుగా ఎవరూ ఉండటం లేదు. నవంబర్‌లో 5 యూనిట్లు వినియోగం కాగా రూ.85 బిల్లు వచ్చింది. డిసెంబర్‌లో 5 యూనిట్లు వినియోగానికి ఏకంగా రూ.258 బిల్లు వచ్చింది.

హెచ్‌బి కాలనీలో ఓ వినియోగదారుడు బిల్లులో విద్యుత్ వినియోగం ఖర్చు రూ.27.72 అయితే ఫిక్స్‌డ్ చార్జీ రూ.30, కస్టమర్ చార్జీ రూ.25, ఇంధనం సర్దుబాటు చార్జీ-1 రూ.267.36, ఇంధనం సర్దుబాటు చార్జీ-2 రూ.102 కలిపి మొత్తం రూ.447.33 బిల్లు వచ్చింది. అంటే విద్యుత్ వినియోగం బిల్లు 6 శాతం అయితే 94 శాతం అదనపు భారం.



ఆరిలోవకు చెందిన బోన రెడ్డి ఇంటర్మీడియట్ **మధ్యలోనే** ఆపేశాడు. కొద్ది నెలలుగా తన బావతో కలిసి ఆరిలోవలో సెల్ షాపు నిర్వహిస్తూ తల్లికి చేదోడుగా ఉంటున్నాడు. ఈ షాపునకు ఈనెల వచ్చిన కరెంట్ బిల్లు రెడ్డికి మరింత భారంగా మారింది. గత నెల కంటే అదనంగా రూ.268 వచ్చింది. నవంబర్ నెలలో 97 యూనిట్లకు రూ.888 బిల్లు రాగా డిసెంబర్‌లో 110 యూనిట్లకు ఏకంగా రూ.1,156 బిల్లు వచ్చింది.



ఈ మూడే కాదు ఏ ఇంటి తలుపు తట్టినా కరెంట్ షాక్ కొడుతోంది. కూటమి ప్రభుత్వం కొత్త సంవత్సరం కానుకగా.. ప్రజలందరికీ కరెంటు బిల్లుల బోనస్ అందించింది. ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో జనంపై పెనుభారం మోపింది. సీఎం చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి అంటే ఇదేనేమో మరి.

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ బిల్లులు వినియోగదారులకు గుబులు పుట్టిస్తున్నాయి. జేబులకు చిల్లు పెడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు 'బాదుడే బాదుడు..' అంటూ గగ్గోలు పెట్టారు.. అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలు పెంచబోమని ప్రకటించారు.. గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం రెండు సార్లు విద్యుత్తు బాంబులు పేల్చేసింది. పెంచిన ట్రూఅప్, సర్దుబాటు చార్జీల భారంతో సామాన్యులు బెంబేలెత్తిపోయే పరిస్థితి తెచ్చింది. విద్యుత్తు వినియోగపు చార్జీల కంటే అదనపు బాదుడే అధికమైందంటూ షాక్ తినడం జనం వంతైంది. డిసెంబర్ బిల్లులు చూసిన వినియోగదారులు.. గత నెల బిల్లు కట్టినా.. రెండు నెలల బిల్లు కలిపి వచ్చిందేమోనని కంగారుపడుతున్నారు. జిల్లాలో ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులు 18,44,549 మంది ఉండగా.. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు రూ.5360.52 కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేస్తోంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదనంగా సుమారు రూ.293 కోట్లు విద్యుత్ వినియోగదారుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తోంది.

జనానికి బాసటగా వైఎస్సార్‌సీపీ

చలికాలంలో విద్యుత్ వాడకం తగ్గినా బిల్లులు మాత్రం పెరుగుతుండటంపై జనాగ్రహం వెల్లువెత్తుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సగటున యూనిట్ ధర రూ.3.21 ఉంటే .. ప్రస్తుత కూటమి ప్రభుత్వం యూనిట్ ధరకు ఐదు రెట్లు అధికంగా వసూలు చేస్తోంది. దాదాపు 13 రకాల సుంకాలను వసూలు చేస్తూ యూనిట్ ధర రూ.15 వరకూ బాదేస్తోంది. బిల్లు చెల్లించడంలో కాస్త జాప్యం జరిగినా.. అపరాధ రుసుముతో సహా బిల్లులు వసూలు చేయాలని డిస్కమ్‌లకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేశాయి. సర్కారు దగాపై జనం నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాగ్రహానికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రతీ నియోజకవర్గంలో విద్యుత్ కార్యాలయాల ముందు నిరసనలు, ధర్నాలు గురువారం చేపట్టనుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న విద్యుత్ కార్యాలయంలోని అధికారులకు విద్యుత్ చార్జీల పెంపును తక్షణమే రద్దు చేయాలంటూ వైఎస్సార్ సీపీ నేతలు వినతిపత్రం అందజేస్తారు. అనంతరం అక్కడ నుంచి జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి బైక్ ర్యాలీగా వెళ్లి జిల్లా విద్యుత్ శాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయం ఎదుట విద్యుత్ వినియోగదారులతో కలిసి వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన తెలియజేయనున్నారు.

సర్దుబాటు బాదుడు



గత నెల బిల్లు కంటే ఈనెల బాగా పెరిగింది. సర్దుబాటు చార్జీలు పేరిట యూనిట్‌కు 40 పైసలు పెంచారు. ఈనెల సర్దుబాటు చార్జీలు పేరిట రూ.262 అదనంగా బిల్లు వేశారు. మా సర్వీస్ మీటరు ఎస్సీ కేటగిరిలో ఉండేది. 200 యూనిట్ల వరకు సబ్సిడీ పోగా అదనంగా వినియోగంపై బిల్లు చెల్లించేవాళ్లం. కొద్ది నెలలుగా సబ్సిడీ ఆపేశారు. పూర్తిగా బిల్లు చెల్లించాల్సి వస్తోంది. దానికితోడు సర్దుబాటు చార్జీలు అదనం. పేద, మధ్య తరగతి వారిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ చార్జీల భారం లేకుండా చూడాలి.

– జె.డి.ఆర్.ఎల్.భవాని, సీతంపేట



ఏవేవో చార్జీలంట..



నేను ఒంటరిగా ఉంటున్నాను. లైట్, టీవీ, ఫ్యాన్ వినియోగిస్తాను. ప్రస్తుతం చలి కారణంగా ఫ్యాన్ వాడటం లేదు. నవంబర్‌లో 50 యూనిట్ల వాడకానికి మొత్తం రూ.180 బిల్లు వచ్చింది. ఈ నెలలో 25 యూనిట్లే వినియోగించాను. అంటే గత నెల కంటే సగం యూనిట్లు. ఆ లెక్కన గత నెల బిల్లులో సగం రూ.90 రావాలి. ఏవేవో చార్జీలని చెప్పి భారం మోపారు.

– కొండపు పాపయ్యమ్మ, చిట్టివలస, భీమిలి జోన్



అన్ని నియోజకవర్గాల్లో విద్యుత్ ఆందోళనలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తెలిపారు. సిరిపురంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళనలో భాగంగా జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోని విద్యుత్ విభాగ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ 15,500 కోట్లు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపడం దారుణమన్నారు. డిసెంబర్ నెలలో బిల్లులు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. బాబు ష్యూరిటీ బాదుడు గ్యారంటీ అన్నరీతిలో పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఓ పక్క విద్యుత్ చార్జీలు, మరోపక్క రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడు కనిపిస్తోందన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి ఇప్పుడు రెండింతలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసేలేదన్నారు. ప్రజలను మోసగించి ఆర్థిక భారాలు మోపుతున్న ఈ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే విధంగా ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ ఆందోళన చేపడుతోందన్నారు.

మైనారిటీస్ ఫైనాన్స్ ఈడీగా షంసున్నీసా బేగం



జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను కలిసిన షంసున్నీసా బేగం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా డిప్యూటీ కలెక్టర్ షంసున్నీసా బేగం గురువారం బాధ్యతలు చేపట్టారు. పాతపోస్టాఫీసు వద్దనున్న ఉమ్మడి విశాఖ జిల్లా మైనారిటీస్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రస్తుత ఈడీ సత్యపద్మ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

న్యూ ఇయర్ ఈవెంట్లకు అనుమతులు తప్పనిసరి



పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నూతన సంవత్సర ఈవెంట్లు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. 31వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట వరకు కార్యక్రమాలు, ఈవెంట్స్ నిర్వహించాలనుకుంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్వాహకులు తమ సంస్థలోని అన్ని ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్దే కాకుండా పార్కింగ్ ప్రదేశాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఆ రోజు నగరంలో పలు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. 31వ తేదీ రాత్రి 8 నుంచి 1వ తేదీ తెల్లవారుజాము 5 వరకు పలు ప్రాంతాల్లో వాహనాల మళ్లింపు, రాకపోకలపై నిషేధం ఉటుందన్నారు. ప్రధానంగా బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకల్ని పూర్తిగా నిషేధించనున్నట్లు వెల్లడించారు.

నిర్వాహకులు పాటించాల్సినవి

- నిర్వహణ ప్రదేశంలో ట్రాఫిక్ నిర్వహణ, ప్రవేశం, భద్రత కోసం సెక్యూరిటీ గార్డులను నియమించాలి.
- ఎటువంటి అశ్లీలత/న్యూడిటీ ఉండకూడదు.
- ప్రైవేట్ రిసార్ట్ యాజమాన్యాలు 24/7 ఒక సూపర్‌వైజర్/గార్డును వారి స్విమ్మింగ్ పూల్ వద్ద నియమించాలి. మద్యం మత్తులో ఉన్న వారిని స్విమ్మింగ్ పూల్‌లోకి అనుమతించరాదు.
- శబ్ద స్థాయిలు 45 డెసిబెల్స్ కంటే తక్కువగా ఉండాలి.
- ఈవెంట్ ప్రదేశంలో ఎలాంటి ఆయుధాలను అనుమతించకూడదు.
- ఈవెంట్లకు సామర్థ్యానికి మించి పాస్‌లు, టికెట్లు, కూపన్లు ఇవ్వరాదు.
- జంటల కోసం నిర్వహించే కార్యక్రమాల్లో, పబ్, బార్లలో మైనర్లను అనుమతించరాదు.
- మాదకద్రవ్యాలు, నార్కోటిక్, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం నిషేధం.
- ఎక్సైజ్ శాఖ అనుమతించిన సమయానికి మించి మద్యం అందించకూడదు.
- మద్యం సేవించి ఉన్న కస్టమర్లు వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరడానికి డ్రైవర్లు/క్యాబ్‌లను అందించే ఏర్పాట్లు చేయాలి.
- మందుగుండు సామగ్రి ఉపయోగించరాదు.
- చైన్ స్నాచర్లు ఉండే అవకాశం ఉన్నందున విలువైన వస్తువులు, బ్యాగులు జాగ్రత్తగా చూసుకోవాలి.
- నోవాటెల్ హోటల్ జంక్షన్, ఆర్‌కే బీచ్, భీమిలి, గాజువాక, పెందుర్తి పరిసరాల్లో షీ-టీమ్స్ అందుబాటులో ఉంటాయి. మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే సంబంధిత షీ-టీమ్స్‌ను సంప్రదించాలి.

ప్రజలకు సూచనలు

- మద్యం తాగి వాహనం నడిపితే కేసులు తప్పవు. అలాంటి వారి వాహనాన్ని స్టేషన్‌కు తరలిస్తాం. మరుసటి రోజు పని దినంలో ఒరిజినల్ లైసెన్స్, ఆర్‌సీతో స్టేషన్‌కు రావాలి. సమన్లు వచ్చినపుడు కోర్టులో హాజరుకావాలి.
- మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా, 6 నెలల జైలుశిక్ష తప్పదు.
- మైనర్లు వాహనాన్ని నడపరాదు. వారికి వాహనాలు ఇస్తే వాహన యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసివేయకూడదు. శబ్ద కాలుష్యాన్ని నివారించాలి.
- వాహనాలను అధిక వేగంతో, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయరాదు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నల్లక్వారీ మడుగులో మునిగి బాలుడి మృతి



మడుగు నుంచి అర్జున్ మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు (ఇన్‌సెట్‌లో అర్జున్ ప్రధాన్(ఫైల్))

పెందుర్తి: పాఠశాలలకు సెలవు కావడంతో సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లిన ఓ బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడు. పెందుర్తి సమీపంలోని నల్లక్వారీ మడుగులో జరిగిన ఈ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చినముషిడివాడ సమీపంలోని హుద్‌హుద్ కాలనీలో నివాసం ఉంటున్న ధీరజ్ ప్రధాన్ దంపతులకు నలుగురు సంతానం. పదేళ్ల క్రితం నేపాల్ నుంచి బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చిన ధీరజ్ కార్పెంటర్‌గా పనులు చేస్తుంటాడు. అతని రెండో కుమారుడు అర్జున్ ప్రధాన్(12) చినముషిడివాడలోని పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. బుధవారం క్రిస్మస్ సెలవు కావడంతో మధ్యాహ్నం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా వారితో కలిసి సమీపంలోని నల్లక్వారీ మడుగులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయిన అర్జున్ మృతి చెందాడు.

తప్పిపోయాడని ఫిర్యాదు

ఇంటి నుంచి బయటకు వెళ్లిన అర్జున్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో బుధవారం రాత్రి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో తండ్రి ధీరజ్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం నల్లక్వారీ మడుగులో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడి వెళ్లిన సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ అసిరితాత మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం మృతదేహం గుర్తింపు కోసం ధీరజ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విగతజీవిగా పడి ఉన్న అర్జున్‌ను చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధించారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

గ్యాస్ లీక్ ఘటనలో తల్లీ కొడుకుల పరిస్థితి విషమం

ఆరిలోవ: గ్యాస్ సిలిండర్ లీకైన ఘటనలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరానగర్‌లో బుధవారం రాత్రి ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు లీకై ఏడుగురు వ్యక్తులు ప్రమాదానికి గురైన సంఘటన తెలిసిందే. ఇందులో ముగ్గురికి వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రిలో, ఇద్దరికి విమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేసి అదేరోజు రాత్రి ఇంటికి పంపించేశారు. రూరల్ మండల రెవెన్యూ అధికారులు సంఘటన జరిగిన ఇంటిని గురువారం పరిశీలించారు. నష్ట వివరాలు సేకరించారు. విజయవాడలో హాస్టల్లో చదువుతున్న తన ఇద్దరు కుమారులను క్రిస్మస్ సెలవులు రావడంతో రెండు రోజుల క్రితం సత్యవతి ఇంటికి తీసుకొచ్చినట్లు స్థానికులు చెప్పారు. సెలవులకు ఇంటికి రాకపోతే ఆ పిల్లలకు ప్రమాదం తప్పేదని స్థానికులు కంట తడి పెట్టుకున్నారు. మెడికవర్‌లో ఉన్న టి.సత్యవతి(28), ఆమె చిన్న కుమారుడు రాజశేఖర్(11) పరిస్థితి విషమంగా ఉన్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. పెద్ద కుమారుడు చంద్రశేఖర్(13) ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. విమ్స్‌లో చికిత్స పొందుతున్న నందిని(22), పి.వెంకట్(30)కు గాయాల తీవ్రత తక్కువ కావడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. మెడికవర్‌లో చికిత్స పొందుతున్న తల్లి, ఇద్దరు కుమారులకు మెరుగైన వైద్యం అందించే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాలు జారి రైలు కింద పడి మహిళ మృతి



అగనంపూడి : హౌరా నుంచి బెంగళూరు వెళ్తున్న రైలు ఎక్కుతుండగా మహిళ కాలు జారి పడిపోయి మృతి చెందింది. ఈ సంఘటన దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మల్దకి చెందిన జరినా బేగం (49) వైద్య చికిత్స నిమిత్తం గురువారం బెంగళూరుకి చిన్న కూతురు, పెద్ద అల్లుడు, మరొక బంధువుతో కలిసి రైల్లో బయలుదేరింది. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో తాగునీటి కోసం ప్లాట్‌ఫారం–1లో దిగింది. రైలు వెళ్లిపోతుందని కంగారులో ఎక్కుతుండగా కాలు జారి పడిపోయింది. సంఘటన స్థలంలోనే ఆమె మృతి చెందింది. దువ్వాడ జీఆర్పీఎఫ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దువ్వాడ జీఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హరిదాసుకు కానుకలు వేస్తున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో అమ్మ దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సిరులతల్లికి నీరాజనం

- వైభవంగా సహస్ర ఘటాభిషేకం
- 20 వేల మంది భక్తులకు మహాన్నదానం
- 28న కనకమహాలక్ష్మి రథయాత్ర



సహస్ర ఘటాభిషేకంలో ఈవో శోభారాణి

డాబాగార్డెన్స్: సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు కొలువుదీరిన బురుజుపేట భక్తులతో కిక్కిరిసిపోయింది. మార్గశిర మాసం నాలుగో గురువారం సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. మేలుకొలుపు అనంతరం అమ్మవారిని పసుపు నీళ్లు, పంచామృతాలతో అభిషేకించి పసుపు పూశారు. స్వర్ణాభరణాలతో అలంకరించారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 వరకు ఈ అలంకరణతోనే భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచాలు తొడిగారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు మహానివేదన(రాజభోగం), 12 నుంచి 3 వరకు సర్వదర్శనం కల్పించి, అనంతరం దర్శనాలు నిలిపివేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సహస్రఘటాభిషేకం వైభవంగా జరిపారు. రాత్రి 7 నుంచి అమ్మవారి దర్శనాలు పునరుద్ధరించారు. తొలిపూజలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

28న రథయాత్ర

ఈ నెల 28న కనకమహాలక్ష్మి రథయాత్ర నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4 నుంచి జగదాంబ జంక్షన్, మహారాణిపేటలోని అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభించనున్నారు. జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ డౌన్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు యాత్ర సాగనుంది.

మహాన్నదానం

టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

క్యూలైన్లు కిటకిట

క్యూలైన్లు ఆలయం నుంచి రీడింగ్ రూమ్ మీదుగా టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయానికి చేరుకున్నాయి. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో క్యూలైన్లలో ఉన్నవారికి మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను దేవస్థానం అందించింది. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందించాయి.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ కిరణ్మయి, కుటుంబ సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్ జె.సుభద్ర, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వీరిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు పాతనగరానికి చెందిన సంఘ సేవకుడు ఎం.వీరభద్రరావు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారికి స్వయంగా పూజలు చేస్తున్న భక్తులు

నేటి కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 వరకు సర్వదర్శనం, 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తరనామార్చన నిర్వహిస్తారు.

కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా బీవీ రమణ



రమణను అభినందిస్తున్న కేజీహెచ్ సిబ్బంది

మహారాణిపేట: కేజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్(అడ్మినిస్ట్రేటర్)గా బీవీ రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని ఆరు బోధనాస్పత్రుల్లో అడ్మినిస్ట్రేటర్ పోస్టులను సృష్టించి, వాటిలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారును నియమిస్తూ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన రమణను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌తోపాటు, అసిస్టెంట్ డైరెక్టర్ పీఎస్ అప్పారావు, ఆంధ్రా మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.లోకనాథన్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, డాక్టర్ ధవళ భాస్కరరావు, మేనేజర్ పీఎం జవహర్, అకౌంటెంట్ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

రేపు జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మహారాణిపేట ఎస్‌పీసీ (నాక్) కేంద్రంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో వినీస్ రిటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ గ్రూప్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. వినీస్ రిటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్, బీడీఎం, విజువల్ మర్చండైజింగ్, సేల్స్ ఆఫీసర్, సీనియర్ అకౌంటెంట్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, ఆఫీస్ బాయ్స్, రిటూల్ టెక్స్‌టైల్ సేల్స్ ఏఏస్ఎం ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఎంపికైన యువతీ యువకులు విశాఖపట్నం, ఆటోనగర్ గాజువాకలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, రూ.10,000 నుంచి రూ.25,000 వరకు నెలవారీ జీతం ఉంటుందని తెలిపారు. ముత్తూట్ గ్రూప్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్స్, ఇంటర్న్‌షిప్ ట్రైనీ ఉద్యోగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎం.కామ్ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, గాజువాకలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 96761 70026 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని వివరించారు.



సముద్రతీరంలో పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు, పిల్లలు



గంగమ్మా.. కరుణించమ్మా!

ఎంవీపీకాలనీ: గంగమ్మతల్లి పూజా మహోత్సవం జాలరిపేటలో గురువారం కనుల పండువగా జరిగింది. 2004 డిసెంబర్ 26న సునామీ సృష్టించిన బీభత్సం అనంతరం ఏటా అదే రోజున పెదజాలరిపేట మత్స్యకారులు గంగమ్మ తల్లికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తమ కుటుంబాలను చల్లగా చూడాలని, విపత్తుల నుంచి రక్షించాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు. తీరంలో పూజల అనంతరం పూజా సామగ్రిని సముద్రంలో విడిచిపెట్టారు. మత్స్యకార మహిళలు నిర్వహించిన కలశాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. తీరంలో మహిళలు వరుసక్రమంలో నిలిచి, కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేశారు. సముద్రానికి హారతి ఇచ్చి, పసుపునీటిని, పాలను సముద్రంలో కలిపి, ఆ నీటిని శిరస్సుపై చల్లుకున్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మత్స్యకార మహిళలతో పోటెత్తిన సాగర తీరం

ఫిష్‌కాన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఫిష్‌కాన్ నూతన కార్యవర్గం

మహారాణిపేట: ఫిష్‌కాన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలో గురువారం జరిగిన రాష్ట్ర మత్స్యకార సముదాయ సంఘాల నెట్‌వర్క్ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా మూగి శ్రీరామమూర్తి(విశాఖ), అధ్యక్షుడిగా సూరాడ రాజారావు(శ్రీకాకుళం), ఉపాధ్యక్షుడిగా ఆర్.శివాజీ(తిరుపతి), ప్రధాన కార్యదర్శిగా కదిరి పోలరాజు(విశాఖ), సంయుక్త కార్యదర్శులుగా పీజీ వెంకటేష్(కర్నూలు), పి.నాగాంజనేయులు(బాపట్ల), కోశాధికారిగా బడే కనకమహాలక్ష్మి(విశాఖ), కార్యనిర్వాహక డైరెక్టర్‌గా అర్జిల్లి దాసు, రాష్ట్ర డైరెక్టర్లుగా చిన్నమ్మలు, రామలక్ష్మి, పేర్ల మసేనమ్మ, మద్దు నూకమ్మ, ఉమ్మిడి నళిని, చోడిపల్లి కోదండరావు, కె.రాజశేఖర్, బైపల్లి అశోక చక్రవర్తి, వాసుపల్లి నారాయణరావు, కొవిరి కొర్లయ్య, ఉమ్మిడి దేవుడు, డి.నరసింహులు, వాడమోదుల జగ్గారావు, సూరాడ నూకరాజు, మైలపల్లి జగ్గారావు, ఒరుపుల శంకరరావు, ప్రవీణ్ కుమార్, ప్రళయకావేరి వేణుగోపాల్, చేపల రాజమ్మ, సలహాదారులుగా డాక్టర్ కొల్లు శ్రీనివాసరావు, కర పండయ్య, ఆవల రమేష్, కోడ లక్ష్మణరావు తదితరులు ఎన్నికయ్యారు.

ఐఈఏ కార్యనిర్వాహక సభ్యుడిగా పరమేశ్వరరావు



ఎంవీపీకాలనీ: ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్(ఐఈఏ) కార్యనిర్వాహక సభ్యుడిగా ఆచార్య కె.పరమేశ్వరరావు ఎన్నికయ్యారు. ఏయూ విశ్రాంత ఎకనామిక్స్ ఆచార్యుడైన ఆయన్ను ఈ మేరకు నియమిస్తూ అసోసియేషన్ ఉత్తర్వులు అందించింది. హర్యానాలో మహర్షి మార్కండేశ్వర్ డీమ్డ్ యూనివర్సిటీలో జరిగిన 107వ ఐఈఏ వార్షిక సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఆచార్య పరమేశ్వరరావు తెలుగు రాష్ట్రాల నుంచి కార్యనిర్వాహక సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఏయూ ఆచార్యులు, విద్యావేత్తలు అభినందనలు తెలిపారు.

కులగణనపై సచివాలయాల పరిధిలో సర్వే

- 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

మహారాణిపేట: రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలపై సమీక్ష చేసేందుకు, పథకాల అమలు కోసం నిర్వహించిన కులగణనపై గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సామాజిక సర్వే (సోషల్ ఆడిట్)ను పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 26వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో సోషల్ ఆడిట్ జరుగుతుందని, ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ కూడా ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో కులగణనకు సంబంధించిన జాబితాలను ఈ నెల 26న ప్రచురించాలని, 26 నుంచి 31వ తేదీ వరకు ప్రజల నుంచి లేదా థర్డ్ పార్టీ నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపారు. అభ్యంతరాల వివరాలను అధికారులు ఆన్‌లైన్ చేయాలని, అనంతరం డేటాను ధ్రువీకరించి జనవరి 10న తుది కులగణన సర్వే డేటా ప్రచురించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారులు ఈ కులగణన ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.

వైద్య ఆరోగ్యశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

- దరఖాస్తు తుది గడువు జనవరి 6

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, నేషనల్ హెల్త్ మిషన్(ఎన్ఎంహెచ్) డైరెక్టర్ అనుమతితో ఈ నియామకాలు చేపట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. మైక్రోబయోలజిస్ట్(1), సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్(3), ల్యాబ్ టెక్నీషియన్(3), నిక్షయ్ ఆపరేటర్(1), ల్యాబ్ అటెండెంట్(1), ఫార్మసిస్ట్(1) పోస్టులను అవుట్ సోర్సింగ్/కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాఖలోని స్టేట్ డ్రగ్ స్టోర్‌లో ఫార్మసిస్ట్ పోస్టు కాంట్రాక్ట్, మిగిలినవి తిరుపతిలోని సీఅండ్‌డీఎస్‌టీ ల్యాబ్ ఔట్‌సోర్సింగ్ ఖాళీలు. దరఖాస్తు చేసుకునేందుకు జనవరి 6 తుదిగడువుగా వెల్లడించారు. వివరాలను cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

సాగర తీరంలో ఎర్ర కవాతు



తీరంలో కవాతు చేస్తున్న సీపీఐ శ్రేణులు

ఏయూ క్యాంపస్: భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) శత వార్షికోత్సవాల ప్రారంభం సందర్భంగా బీచ్‌రోడ్డులో ఎర్ర కవాతు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు సర్కిల్ నుంచి ఆర్కే బీచ్ వరకు సాగారు. కమ్యూనిస్టు పార్టీ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో భారత్‌లో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం కాపాడేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. రష్యాలో లెనిన్ సారథ్యంలో విప్లవం విజయం సాధించడంతో మన దేశంలో స్వాతంత్ర్య పోరాట సమయంలో మార్క్సిజాన్ని అధ్యయనం చేసి 1925 డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో పార్టీ చేసిన కృషిని వివరించారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్లి ఉద్యమాలను నిర్మించి దేశంలో సృష్టించిన సంపదను అందరికీ సమానంగా పంచేందుకు, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, రాష్ట్ర సమితి సభ్యుడు సీహెచ్ రాఘవేంద్రరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు, ఎ.విమల, ఎస్కే రహమాన్, కె.సత్యాంజనేయ, జి.రాంబాబు, కె.సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా పోలీస్ వెయిటింగ్ హాల్ ప్రారంభం



మహిళా పోలీస్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న సీపీ సతీమణి సువశ్రీ బాగ్చీ

విశాఖ సిటీ: విశాఖ నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో పునర్నిర్మించిన ఉమెన్ పోలీస్ వెయిటింగ్ హాల్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సతీమణి సువశ్రీ బాగ్చి గురువారం ప్రారంభించారు. సీపీ వాట్సాప్ నెంబర్ 7995095799కు వచ్చిన వినతుల మేరకు ఈ వెయిటింగ్ హాల్‌ను పునర్నిర్మించారు. గతంలో రేకుల షెడ్డులో ఉండే ఈ వెయింటింగ్ హాల్ శిథిలావస్థకు చేరుకోవడంతో మహిళా పోలీసుల విజ్ఞప్తుల మేరకు సీపీ నూతన గోడలు, కిటికీలు, పూర్తి సీలింగ్, బాత్ రూమ్‌లతో పాటు ఫ్యాన్లు, ఏసీలు ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మహిళా సిబ్బంది వాటర్ ప్యూరిఫైర్, డైనింగ్ టేబుల్, చైర్స్, టీవీ, లాకర్లు, ఇలా పలు సౌకర్యాలు కల్పించాలని సీపీని కోరారు. దీనికి సీపీ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులు వెంటనే ఆయా వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మెము స్థానంలో సాధారణ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం నడుస్తున్న మెము రైళ్ల స్థానంలో గతంలో మాదిరి సాధారణ రైళ్లను నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

1)విశాఖపట్నం–పలాస–విశాఖపట్నం (07470/07471) మెము పాసింజర్ స్పెషల్ ఈ నెల 28వ నుంచి మార్చి 1 వరకు సాధారణ రైలుగా నడవనుంది. ఈ రైళ్లు జనవరి 1వ తేదీ నుంచి మారిన నెంబర్లతో నడుస్తాయి. విశాఖపట్నం–పలాస–విశాఖపట్నం(67289 /67290) నెంబర్లుతో (శుక్ర, ఆదివారాలు మినహా) నడుస్తాయి.

2)విశాఖపట్నం–విజయనగరం(07468) మెము పాసింజర్ ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 28 వరకు (గురువారాలు మినహా) సాధారణ రైలుగా నడుస్తుంది. విజయనగరం–విశాఖపట్నం (07469) మెము పాసింజర్ 28 నుంచి మార్చి 1 వరకు (శుక్రవారాలు మినహా) సాధారణ రైలుగా నడుస్తుంది. ఈ రైళ్లు జనవరి 1వ తేదీ నుంచి మారిన నంబర్లు (67287/67288)తో నడవనున్నాయి.

విశాఖ–విజయనగరం రైలు పార్వతీపురం వరకు పొడిగింపు

విశాఖ–విజయనగరం – విశాఖ (67287/67288) మధ్య నడిచే రైలును ఈ నెల 27 నుంచి తాత్కాలికంగా పార్వతీపురం వరకు పొడిగించారు. విశాఖపట్నంలో ఈ నెల 27న బయల్దేరే విశాఖపట్నం–విజయనగరం(67687)రైలు పార్వతీపురం వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 28న (67288) పార్వతీపురం నుంచి బయల్దేరుతుందన్నారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్లీపర్ క్లాస్ కోచ్

పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా అదనపు స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం–అమృత్‌సర్(20807)హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27నుంచి, అమృత్‌సర్–విశాఖపట్నం(20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 29వ తేదీ నుంచి 1 స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు టౌన్‌ప్లానింగ్ గ్రీవెన్స్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన ఫిర్యాదుల్ని శుక్రవారం స్వీకరించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారులు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.